E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :330 బుధవారం 11 నవంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ రాక!


2 లో

- భారత్ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం
- గిగ్ వర్కర్లతో ప్రత్యేక భేటీ
- బీసీ ప్రాతినిధ్యంపై కీలక చర్చ
- మెగా బీసీ ర్యాలీకి ఆహ్వానం
- నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ

మూడు రోజులు చలి మంటలే!

- 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్
- ఏడు జిల్లాల్లో 12 డిగ్రీల చలి
- ఆదిలాబాద్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత
- హైదరాబాద్‌లోనూ పెరిగిన చలి
- తెల్లవారుజామున పొగమంచు హెచ్చరిక
- చిన్నారులు, వృద్ధులు అప్రమత్తం


2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముందని అంచనా వేసింది.ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని తెలిపింది.

పదవుల ప్రకటనతో రచ్చ..

24 గంటల్లోనే బ్రేక్!

తెలంగాణ కాంగ్రెస్‌లో నియామకాల గందరగోళం

- 24 గంటల్లోనే మీడియా పదవులకు బ్రేక్
- తదుపరి ఆదేశాల వరకు నియామకాలు నిలిపివేత
- జాబితాపై నేతల్లో తీవ్ర అసంతృప్తి
- పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదుల వెల్లువ
- 16 మందితో మీడియా ప్యానెలిస్టుల జాబితా
- నలుగురికి మీడియా కో-ఆర్డినేటర్ల బాధ్యతలు
- 49 మందితో అధికార ప్రతినిధుల జాబితా
- కాంగ్రెస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా నియామకాలు

2 లో

ప్రధాని కుర్చీ వద్దు.. పిల్లలే ముఖ్యం!

- ప్రధాని పదవిపై సోనియా సంచలన విషయాలు
- పిల్లల నుంచే తీవ్ర వ్యతిరేకత
- ఇందిర, రాజీవ్ హత్యల భయం
- కూటమి నేతల నుంచి ఒత్తిడి
- రాహుల్, ప్రియాంకల నిలదీత
- అంతరాత్మ మాటతో మారిన నిర్ణయం



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తాజాగా రాసిన తన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకంలో 2004 ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న అనూహ్య రాజకీయ పరిణామాలు, ప్రధాని పదవిని తిరస్కరించడానికి దారితీసిన అసలు కారణాలను మొదటిసారిగా బహిర్గతం చేశారు. ఆ రోజుల్లో దేశ రాజకీయాలను కుదిపేసిన ఆ నిర్ణయం వెనుక తీవ్రమైన కుటుంబ ఆందోళనలు, అంతర్మథనం ఉన్నట్లుగా ఆమె తెలిపారు.

పిల్లల తీవ్ర వ్యతిరేకత.. 'అబ్సొల్యూట్లీ నాట్'

2004 లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని చేపడతారా అని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ తల్లిని ప్రశ్నించారట. అందుకు సోనియా గాంధీ ఏమాత్రం ఆలోచించకుండా 'అబ్సొల్యూట్లీ నాట్' అంటే ఖచ్చితంగా వద్దని బదులిచ్చారని ఆత్మకథలో వెల్లడించారు.

రైతుల పంతం నెగ్గింది.. కడెం నుంచి నీళ్లు!

- రైతుల ఆందోళనకు ఫలితం
- కడెం నుంచి 700 క్యూసెక్కుల విడుదల
- చివరి ఆయకట్టుకు సాగునీరు
- జన్నారం, దస్తురాబాద్ రైతులకు ఊరట
- మంత్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే బొజ్జు
- రైతులకు ఎమ్మెల్యే భరోసా

2 లో

ఎల్‌నినో దెబ్బకు వర్కింగ్ డేస్‌లో మార్పు?

- తెలంగాణలో ఐదు రోజుల పనిదినాలపై కసరత్తు
- పనిగంటలు పెంచి పనిదినాలు తగ్గించే యోచన
- ఉద్యోగ సంఘాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తి
- సీఎం రేవంత్‌కు నివేదిక ఇచ్చేందుకు సిద్ధం
- ప్రభుత్వ ఆఫీసులకే కొత్త విధానం పరిమితం?
- హైదరాబాద్‌లో పెరుగుతున్న నీటి కష్టాలు
- వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ఐటీ కంపెనీల మొగ్గు

2 లో



ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధి, పాలనాపరమైన అంశాలతో పాటు రాజకీయ, సంక్షేమ దిశానిర్దేశాలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో సుమారు 30కి పైగా ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయంపై మంత్రివర్గం హర్షం వ్యక్తం చేయగా, సీఎం చంద్రబాబు మంత్రులకు పలు కీలక సూచనలు చేశారు. స్థానిక ఎన్నికల విజయం చూసి గర్వంతో విర్రవీగిపోవద్దని, మరింత ఒద్దికగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ, 2029 లక్ష్యంగా అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మేలు చేయాలని పిలుపునిచ్చారు.

మిగతాది 2 లో..

- 2029 లక్ష్యంగా చంద్రబాబు దిశానిర్దేశం
- స్థానిక విజయంతో పొంగిపోవద్దు!
- రూ.36 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్
- ఏపీకి ఏఐ డేటా సెంటర్ల క్యూ
- మహిళా పారిశ్రామిక పార్కుకు ఆమోదం
- నిబంధనలు ఉల్లంఘిస్తే భూములు రద్దు
- నిత్యావసర ధరల కట్టడికి సీఎం ఆదేశం
- ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలి!

ముగిసిన మరో బంధం

- పవన్ దంపతుల విడాకులు
- పరస్పర అంగీకారంతో నిర్ణయం
- స్నేహితులుగా కొనసాగనున్న జంట
- పిల్లల భవిష్యత్తే ప్రాధాన్యత
- పవన్‌కు మూడోసారి విడాకులు
- వ్యక్తిగత గోప్యతకు విజ్ఞప్తి


2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి మరోసారి ఊహించని పరిణామం తెరపైకి వచ్చింది. పవన్ కళ్యాణ్ మరియు ఆయన భార్య అన్నా కొణిదెల (అన్నా లెజ్నెవా) తమ దాంపత్య బంధానికి ముగింపు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమ శ్రేయోభిలాషులు, సన్నిహితులను ఉద్దేశించి విడుదల చేసిన ప్రకటనలో ఈ జంట తమ విడాకుల నిర్ణయాన్ని ధ్రువీకరించింది. జీవితంలో ఎంతో విలువైన కాలాన్ని పంచుకున్న అనంతరం, పరస్పర గౌరవం మరియు సంపూర్ణ అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వైవాహిక బంధం ముగిసినా, తాము మంచి స్నేహితులుగా కొనసాగుతామని స్పష్టం చేశారు.

శబరిమల యాత్రకు కొత్త రూల్!


2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): శబరిమల యాత్రకు సిద్ధమవుతున్న అయ్యప్ప స్వామి భక్తులకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, తిరువాంకూర్ దేవస్వం బోర్డు అధికారులు అత్యంత కీలకమైన సూచనలు జారీ చేశారు. శబరిమలలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో మరో ఎన్నికల సమరం!

- పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్
- నవంబర్ 19న ఎంపీపీ ఎన్నికలు
- 20న జడ్పీ చైర్‌పర్సన్ల ఎన్నిక
- చేతులెత్తే విధానంలో ఓటింగ్
- ఎన్నికల్లో పార్టీల విప్ అమలు
- నవంబర్ 14లోపు నోటీసుల జారీ



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముగిసాయి.. ఇక, పరోక్ష ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 659 మండల ప్రజా పరిషత్‌లు (ఎంపీపీలు), 28 జిల్లా ప్రజా పరిషత్‌ల (జడ్పీపిలు) పరిధిలో కో-ఆప్టెడ్ సభ్యులతో పాటు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.ఇందుకోసం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలకు సంబంధించి కీలక షెడ్యూల్‌ను ప్రకటించింది.

డిజిటల్ అరెస్టులపై సుప్రీం కొరడా



- డిజిటల్ అరెస్టులపై సుప్రీం సీరియస్
- వాట్సాప్‌కు ధర్మాసనం నోటీసులు
- రక్షణ చర్యలపై సమగ్ర నివేదిక
- 9,400 అనుమానాస్పద ఖాతాలపై చర్యలు
- మోసాల కట్టడికి కొత్త సాఫ్ట్‌వేర్
- నవంబర్ 23కి తదుపరి విచారణ

2 లో

శబరిమల యాత్రకు కొత్త రూల్!

మొదటి పేజీ తరువాయి

వర్చువల్ క్యూ స్లాట్ బుకింగ్ తప్పనిసరి..

శబరిమల శబరిమల క్షేత్రంలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ప్రశాంత దర్శనం కల్పించేందుకు వర్చువల్ క్యూ విధానాన్ని అమలు చేస్తున్నారు. భక్తులు తమ యాత్ర ప్లాన్ చేసుకునే ముందే శబరిమల అధికారిక పోర్టల్ ద్వారా వర్చువల్ క్యూ స్లాట్‌ను ఖరారు చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా వచ్చే భక్తులకు దర్శన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. భక్తులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఎంతో సులభంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేందుకు వీలుగా అధికారులు ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ను విడుదల చేశారు. భక్తులు తమ స్మార్ట్‌ఫోన్‌తో ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా శబరిమల అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌కు చేరుకోవచ్చు. అక్కడ తమ వివరాలు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు నమోదు చేసి ఉచితంగా వర్చువల్ క్యూ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. మండల-మకరవిలక్కు ఉత్సవాల సీజన్ ప్రారంభమవుతున్న వేళ, దేశ నలుమూలల నుంచి వచ్చే అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, ముందస్తుగా వర్చువల్ క్యూ స్లాట్‌లు నమోదు చేసుకుని సహకరించాలని అధికారులు కోరారు.

పదవుల ప్రకటనతో రచ్చ.. 24 గంటల్లోనే బ్రేక్!



న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణ కాంగ్రెస్‌లో మీడియా విభాగం పదవుల ప్రకటన తీవ్ర గందరగోళానికి దారితీసింది. సోమవారం అత్యంత ఆర్భాటంగా ప్రకటించిన మీడియా ప్యానెలిస్టులు, మీడియా కో-ఆర్డినేటర్లు, అధికార ప్రతినిధుల నియామకాలకు 24 గంటలు గడవకముందే బ్రేక్ పడింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ నియామకాలను నిలిపివేస్తున్నట్లు మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా ప్రకటించింది. టీపీసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేరుతో సోమవారం విడుదలైన ఈ జాబితాపై పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనట్లు తెలుస్తోంది. నియామకాల జాబితాపై పలువురు నేతలు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదులు చేయడంతోనే, అధిష్టానం ఈ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సోమవారం ప్రకటించిన జాబితాలో ఏముంది?

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేరా ఆదేశాల మేరకు ప్రెస్ బ్రీఫింగ్‌లు, టీవీ డిబేట్ల కోసం మీడియా ప్యానెలిస్టులను, మీడియా కో-ఆర్డినేటర్లను, అధికార ప్రతినిధులను నియమిస్తున్నట్లు చామల కిరణ్ కుమార్ రెడ్డి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ప్రస్తుతం ఉన్న టీపీసీసీ అధికార ప్రతినిధులందరికీ తక్షణమే సీనియర్ అధికార ప్రతినిధులుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మీడియా ప్యానెలిస్టులు:

మొత్తం 16 మందితో ఈ జాబితాను విడుదల చేశారు. ఇందులో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, డాక్టర్ జె. రాంచంద్ర నాయక్, బల్మూరి వెంకట్‌తో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ సి. వంశీకృష్ణ, టి. రామ్మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కూచుకుల్ల రాజేశ్ రెడ్డి తదితరులకు చోటు కల్పించారు.

మీడియా కో-ఆర్డినేటర్లు:

నలుగురితో కూడిన ఈ జాబితాలో మీడియా చీఫ్ కో-ఆర్డినేటర్‌గా కె. శ్రీకాంత్ యాదవ్, మీడియా కన్వీనర్‌గా దామోదర్ ఆవెలి, మీడియా కో-ఆర్డినేటర్లుగా తుమ్మల పద్మ, మొగిలి సత్యారెడ్డిలను నియమించారు.

అధికార ప్రతినిధులు:

వీరితో పాటు 49 మందితో కూడిన అధికార ప్రతినిధుల జాబితాను కూడా విడుదల చేశారు. అయితే, జాబితా విడుదలైన మరుసటి రోజే నియామకాలను హోల్డ్‌లో పెట్టడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఎల్‌నినో దెబ్బకు వర్కింగ్ డేస్‌లో మార్పు?



న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): వారానికి ఐదు రోజులే పనిదినాలు పెడితే ఎలా ఉంటుంది? అని ప్రభుత్వం ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వ ఆఫీసుల్లో పని దినాలు కుదించి, పని గంటలు పెంచే అంశంపై డిస్కషన్ జరుగుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం అమలులో ఉన్న 6 పనిదినాల్లో రోజుకు 8 గంటల చొప్పున వారానికి 48 గంటల పాటు పనిచేస్తున్నారు. కానీ కొత్త విధానంలో పని దినాలను 5 రోజులకు కుదించి, ప్రతి రోజూ అదనంగా గంటన్నర పాటు పనిచేసే విధానాన్ని అమలు చేస్తే ఏ విధంగా ఉంటుందోనని సీనియర్ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఎల్ నినో కారణంగా నీటి, కరెంట్ లభ్యత ఇబ్బందిగా ఉండటంతో పనిదినాలను కుదించాలంటూ ఇప్పటికే ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ అంశంపై సాధ్యాసాధ్యాలను స్టడీ చేస్తోన్న ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. పిల్లల చదువులకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని కేవలం ప్రభుత్వ ఆఫీసులకు పరిమితం చేసి, విద్యాసంస్థలకు మాత్రం వారానికి 6 రోజుల పని విధానాన్ని అమలు చేయాలనే చర్చ కూడా ప్రభుత్వ వర్గాల్లో నడుస్తున్నట్టు సమాచారం.

పెరుగుతున్న నీటి సమస్య..

హైదరాబాద్‌లో మంచి నీటి సమస్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. నీటి కొరత కారణంగా పలు ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం అమలు చేస్తున్నాయి. అలాగే, పనివేళల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ఏసీల వినియోగం పెరిగి కరెంటు వినియోగం పెరుగుతున్నది. ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోంకు ప్రయారిటీ ఇస్తున్నాయి. మరోవైపు పలు కార్పొరేటు కాలేజీలు నీటి కొరత కారణంగా కాలేజీలు, హస్టల్స్‌ను మూసివేసి, ఆన్ లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నాయి.

ముగిసిన మరో బంధం

మొదటి పేజీ తరువాయి



To Our Well-Wishers, Near and Dear Ones...

After sharing a significant part of our lives together, we have decided to part ways with mutual understanding and respect.

Though our marriage has come to an end, we remain good friends and devoted parents to our wonderful children. Their happiness and well-being will always remain our shared priority.

During this personal transition, we seek your understanding, kindness, and respect for our privacy.

We extend our heartfelt gratitude to everyone who has stood by us throughout this journey.

Pawan Kalyan Konidala
Anna Konidala

పిల్లల పెంపకం, వారి భవిష్యత్తు మరియు సంతోషమే తమ మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు. ఈ సమయంలో తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించి, ప్రైవసీకి భంగం కలిగించవద్దని కోరారు.

ఈ తాజా పరిణామంతో పవన్ కళ్యాణ్ గత వైవాహిక జీవితం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పవన్ కళ్యాణ్ 1997లో నందినిని వివాహం చేసుకున్నారు. అనంతరం మనస్పర్థల కారణంగా వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు. సహనటి రేణు దేశాయ్‌ను 2009లో పెళ్లి చేసుకున్నారు. వీరి బంధం కొన్నేళ్లపాటు కొనసాగి, 2012లో విడాకులతో ముగిసింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2013 సెప్టెంబర్ 30న అన్నా లెజ్నెవాతో పవన్ కళ్యాణ్ మూడో వివాహం జరిగింది. వీరిద్దరికీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుదీర్ఘ దాంపత్యం అనంతరం 2026లో వీరు కూడా పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. మొత్తంగా పవన్ కళ్యాణ్‌కు నలుగురు పిల్లలు ఉండగా-రేణు దేశాయ్‌తో ఇద్దరు, అన్నా లెజ్నెవాతో ఇద్దరు సంతానం. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సమయంలో ఈ పరిణామం వెలుగుచూడటం సర్వత్రా చర్చకు దారితీసింది.

మూడు రోజులు చలి మంటలే!

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే పలు జిల్లాల్లో రాత్రి వేళల్లో చలి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో చల్లని గాలుల ప్రభావం మరింత ఎక్కువయ్యే సూచనలు ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రాష్ట్రంలోనే అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో 14.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 14.7 నుంచి 15 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి, జనగామ జిల్లాల్లో 14.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో 18 జిల్లాల్లో 15.1 నుంచి 19.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 16.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తెలంగాణ వైపు తక్కువ ఎత్తులో చల్లని గాలులు వీస్తుండటమే ఉష్ణోగ్రతలు తగ్గడానికి ప్రధాన కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టి రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుండటంతో రాత్రి, తెల్లవారుజామున చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని వాతావరణ శాఖ వెల్లడించింది. పగటి వేళల్లో ఎండ సాధారణంగానే ఉన్నప్పటికీ, సాయంత్రం నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. వేకువజామున పొగమంచు కమ్ముకునే అవకాశం ఉందని.. ముఖ్యంగా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో రహదారులపై దృశ్యమానత తగ్గవచ్చని హెచ్చరించారు. వాహనదారులు వేగం తగ్గించి ప్రయాణించాలని, అవసరమైన చోట ఫాగ్ లైట్లు ఉపయోగించాలని సూచిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 16.1 డిగ్రీలుగా నమోదైంది. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, శంషాబాద్ వంటి శివారు ప్రాంతాల్లో తెల్లవారుజామున చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పగటి వేళల్లో మాత్రం వాతావరణం పొడిగా, సాధారణంగా ఉండే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వర్ష సూచన లేదని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.

రాత్రి, తెల్లవారుజామున చల్లని గాలులు ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు వెచ్చని దుస్తులు ధరించడం మంచిది. పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో అనవసర ప్రయాణాలు తగ్గించుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు ముందు వెళ్లే వాహనానికి తగిన దూరం పాటించాలని సూచిస్తున్నారు. మొత్తంగా రాబోయే మూడు రోజులు తెలంగాణలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

స్థానిక సంస్థల్లో మరో ఎన్నికల సమరం!

మొదటి పేజీ తరువాయి

నవంబర్ 19న ఎంపీపీలు.. 20న జడ్పీపిల ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మండల ప్రజా పరిషత్‌ల (ఎంపీపీ) పరోక్ష ఎన్నికలు నవంబర్ 19, 2026న నిర్వహించనున్నారు. జిల్లా ప్రజా పరిషత్‌ల (జడ్పీపి) పరోక్ష ఎన్నికలు నవంబర్ 20, 2026న జరగనున్నాయి. ప్రత్యేక సమావేశాల ద్వారా ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మండల, జిల్లా పరిషత్‌లలో ఎన్నికైన సభ్యులు ఈ సమావేశాల్లో పాల్గొని తమ ప్రతినిధులను ఎన్నుకోనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలకు ముందుగానే కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. మతపరమైన లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన వారిని కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎంపిక చేయనున్నారు. ప్రతి మండల ప్రజా పరిషత్‌కు ఒకరు, జిల్లా ప్రజా పరిషత్‌కు ఇద్దరు చొప్పున కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాలి. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాతే అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

చేతులెత్తే విధానంలో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక : ఎంపీపీ, జడ్పీపి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు చేతులెత్తే విధానంలో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల విప్ వర్తిస్తుంది. అంటే ఆయా పార్టీల సభ్యులు తమ పార్టీ జారీ చేసిన విప్‌కు అనుగుణంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక విషయంలో పార్టీ విప్ జారీ చేయడానికి ఎలాంటి నిబంధన లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే, ఈ ప్రత్యేక సమావేశాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎక్స్-అఫీషియో సభ్యులుగా హాజరుకావచ్చు. కానీ, పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు వేసే హక్కు ఉండదు. ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులే ఈ ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నవంబర్ 14లోపు సమావేశాల నోటీసులు : పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను నవంబర్ 14, 2026లోపు అందజేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. నోటీసుల జారీ, సమావేశాల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా పరిషత్‌లలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది.

డిజిటల్ అరెస్టులపై సుప్రీం కొరడా

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): భారతదేశంలో పెద్ద సమస్యగా మారుతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలు, సైబర్ నేరాల కట్టడిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇలాంటి సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రతిపాదిత రక్షణ చర్యలేమిటో సమగ్రంగా వివరించాలని ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌తో పాటు ఇతర మధ్యవర్తిత్వ సంస్థలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జైమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. 'ఇన్ రీ: విక్టిమ్స్ ఆఫ్ డిజిటల్ అరెస్ట్ రిలేటెడ్ టు ఫోర్జ్ డాక్యుమెంట్స్' పేరిట సుమోటోగా స్వీకరించిన ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, తమ రక్షణ చర్యల ప్రణాళికను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సి) కూడా ఏకకాలంలో సమర్పించాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను నవంబర్ 23కి వాయిదా వేసింది. ఈ విచారణ సందర్భంగా వాట్సాప్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. సైబర్ నేరాలను అడ్డుకునేందుకు ఇప్పటికే 9,400 అనుమానాస్పద ఖాతాలపై చర్యలు తీసుకున్నామని, పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని న్యాయస్థానానికి తెలిపారు. అనుమానాస్పద ఖాతాలను స్వయంచాలకంగా గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేసే అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌పై కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. నకిలీ పత్రాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే డిజిటల్ అరెస్ట్ కుంభకోణాలను అరికట్టేందుకు తీసుకోబోయే పటిష్ట చర్యలను కోర్టు ముందుంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యమిస్తూ, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌పై కేబినెట్ సమీక్షించింది. భీమిలిలో రూ. 31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఏఐ డేటా సెంటర్, నాయుడుపేటలో రూ. 4,000 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ పరిశ్రమ, రాంబిల్లిలో రూ. 570 కోట్లతో ఈప్యాక్ డేటా సెంటర్ పరికరాల తయారీ, తిరుపతిలో రూ. 700 కోట్లతో డిక్సన్ టెక్నాలజీస్, జగ్గయ్యపేటలో 30 ఎకరాల్లో మహిళా పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అలాగే భోగాపురంలో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌కు, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటెరో గ్రూపునకు భూ కేటాయింపులు చేయగా, నిబంధనలు పాటించని తిరుపతిలోని కొన్ని సంస్థల భూ కేటాయింపులను రద్దు చేసింది. విజయవాడలో 15 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌తో పాటు సోలార్, బయోగ్యాస్ ప్రాజెక్టులకు అనుమతులిచ్చింది. సమావేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రత్యేక చర్చ జరిగింది. రైతు బజార్లలో తక్కువ ధరలకే బియ్యం అందిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలపగా, కూరగాయల ధరలు తగ్గినట్లే బియ్యం ధరలను కూడా అదుపులోకి తెచ్చి ప్రజలపై భారం పడకుండా చూడాలని సీఎం ఆదేశించారు. తుఫాన్ లేదా అత్యవసర సమయంలో కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చి విద్యుత్ పునరుద్ధరణకు తీవ్రంగా శ్రమించిన విద్యుత్ సిబ్బంది సేవలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించగా, ప్రభుత్వం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు నేరుగా ఉపయోగపడాలని ముఖ్యమంత్రి ముగించారు.

హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ రాక!

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశం ముగిసింది. ఢిల్లీలో దాదాపు అరగంట పాటు భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, బీసీలకు ప్రాతినిధ్యం వంటి అంశాలపై చర్చించినట్లు మహేశ్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలపై రాహుల్ గాంధీకి నివేదిక అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పీసీసీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను వివరించామన్నారు. ముఖ్యంగా ఓబీసీల సమస్యలు, వారికి రాజకీయంగా కల్పించాల్సిన ప్రాతినిధ్యంపై చర్చ జరిగినట్లు మహేశ్ గౌడ్ చెప్పారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ నవంబర్ 13 లేదా 14 తేదీల్లో హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. అయితే పర్యటన తేదీలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. భారత్ సమ్మిట్‌తో పాటు హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని రాహుల్ గాంధీ సూచించినట్లు వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం గిగ్ యాక్ట్ తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో గిగ్ వర్కర్ల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై రాహుల్ గాంధీ వారితో సమావేశమై మాట్లాడనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు తెలిపారు.

హైదరాబాద్‌లో సర్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న సభతో పాటు మెగా బీసీ ర్యాలీకి కూడా రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు మహేశ్ గౌడ్ వెల్లడించారు. అయితే ఈ కార్యక్రమాలకు సంబంధించిన తేదీలు ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు, వివాదాలపై రాహుల్ గాంధీతో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాలను పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని తెలిపారు. నవంబర్ నెలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. మరోవైపు సోనియా గాంధీ ఆత్మకథను స్వాగతిస్తున్నామని, తెలంగాణలో ఆ పుస్తకంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు చెప్పారు.

రైతుల పంతం నెగ్గింది.. కడెం నుంచి నీళ్లు!



న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): నిర్మల్ జిల్లా రైతుల ఆందోళన ఫలించింది. జన్నారం, దస్తురాబాద్ మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు కడెం ప్రాజెక్టు నుంచి అధికారులు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇటీవల ఈ రెండు మండలాలకు చెందిన రైతులు తమ పంట పొలాలకు నీరు అందించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. రైతుల విజ్ఞప్తి, ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు.

కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రకటన చేశారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. మంత్రులను సంప్రదించిన అనంతరం జన్నారం, దస్తురాబాద్ మండలాల రైతుల పంట పొలాలకు నీరు అందించేందుకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కడెం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో జన్నారం, దస్తురాబాద్ మండలాల రైతులకు ఊరట లభించనుంది.

ప్రధాని కుర్చీ వద్దు.. పిల్లలే ముఖ్యం!

మొదటి పేజీ తరువాయి

1984లో అత్త ఇందిరా గాంధీ, 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్యల తాలూకు భయాలు, విషాదాలను అనుభవించిన ఆమె పిల్లలు.. ప్రధాని పదవి చేపట్టడం వల్ల ప్రాణాపాయం మరింత పెరుగుతుందని సోనియా తీవ్రంగా వ్యతిరేకించారని పుస్తకంలో పేర్కొన్నారు.

కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి.. 'థీక్ హై'

ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కూటమి విజయవంతం కావడంతో, 10 జన్‌పథ్‌లోని రాజీవ్ గాంధీ సమావేశ మందిరంలో కూటమి నేతలంతా సమావేశమయ్యారు. సోనియా గాంధీ తాను ప్రధాని పదవిని చేపట్టబోనని చెప్పినప్పటికీ, నేతలంతా పట్టుబట్టారు. 'మేము దీనిని అంగీకరించము.. మీరు ఈ నిర్ణయం తీసుకోలేరు' అని తేల్చిచెప్పడంతో సోనియా తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ఆ సమయంలో బయట జరిగిన పరిణామాలతో ఆమె ఉక్కిరిబిక్కిరై, బలహీనంగా 'థీక్ హై' అంటే సరే అని మౌనంగా అంగీకరించారట.

రాహుల్, ప్రియాంకల నిలదీత.. మారిన నిర్ణయం

ఈ విషయం తెలుసుకున్న ప్రియాంక గాంధీ వెంటనే రాహుల్ గాంధీని తీసుకుని వెళ్లి తల్లిని నిలదీశారు. 'మీరు అవును అని ఎలా చెప్పారు?' అని రాహుల్ ప్రశ్నించగా, 'వారు వినలేదు, నన్ను తీవ్రంగా ఒత్తిడి చేశారు' అని సోనియా బదులిచ్చారు. దానికి రాహుల్ స్పందిస్తూ.. 'ఒత్తిడా? మీరు ఒత్తిడికి గురవుతున్నారా.. మా గురించా?' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రియాంక కూడా ఒత్తిడికి తలొగ్గవద్దని, మీ అసలు నిర్ణయమేంటో అదే చేయాలని గట్టిగా చెప్పారు. అంతర్గతంగా తీవ్రమైన పోరాటం తర్వాత.. ఇటలీలో పుట్టి పెరిగిన తాను బిలియన్ జనాభా ఉన్న దేశాన్ని ఎలా నడిపించగలననే మీమాంస ఒకవైపు, కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు మరోవైపు ఆమెను విపరీతంగా బాధించాయి. అయితే రాత్రి నిద్రలోకి జారుకునే ముందు, 'సోనియా.. నీ అంతరాత్మకు నిజాయితీగా ఉండు. నీకు ఎప్పుడూ తెలిసిందే చేయి!' అని నిర్ణయించుకున్నారు. కొన్ని గంటల తర్వాత రాహుల్ గదికి వెళ్లి తాను ప్రధాని పదవిని చేపట్టడం లేదని, తన పాత నిర్ణయానికే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 'ఇది సరైన నిర్ణయమే' అని రాహుల్ ఆమెను హగ్ చేసుకున్నారని సోనియా తన ఆత్మకథలో తెలిపారు. చివరికి పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు ఎంతగా కోరినా తన అంతరాత్మ ఒప్పుకోలేదని చెప్పిన సోనియా గాంధీ.. ఆ తర్వాత డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించి దేశ రాజకీయాల్లో ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

జనవరి 25 నుంచి జనగణన..

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (తెలుగు గళం): దేశవ్యాప్తంగా 2027 జనాభా గణన (సెన్సస్) నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నట్టు ప్రకటించింది. జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకొనే అవకాశం కల్పించింది. జనాభా గణన పూర్తయిన అనంతరం మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ చేపట్టనున్నారు.

ఈ మేరకు కేంద్ర హోంశాఖ పరిధిలోని భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ జారీచేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పరిపాలనాశాఖ నవంబర్ 10న తెలంగాణ అసాధారణ గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించాలని ఆదేశించింది. జనాభా గణనలో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభానికి ముందే 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ చేపడుతారు. జనాభా గణనకు సంబంధించి రిఫరెన్స్ తేదీగా మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను నిర్ణయించారు. జనగణన వివరాల సేకరణలో ఈ తేదీని ప్రామాణికంగా తీసుకోనున్నారు.

కొన్ని రాష్ట్రాలకు మినహాయింపు

కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం మణిపూర్ (తదుపరి ప్రకటన వెలువడే వరకు), గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంతోపాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాలకు ఈ షెడ్యూల్ నుంచి మినహాయింపు ఇచ్చారు.

మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రకటించిన తేదీల ప్రకారం జనాభా గణన నిర్వహించనున్నారు. తెలంగాణలో జనగణన ప్రక్రియకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్లు, ప్రధాన జనగణన అధికారులు, సంబంధిత శాఖల అధిపతులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీచేశారు.

ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఏమిటి?-ఎడెల్లి కార్తీక్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి: ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



జఫర్‌గఢ్ నవంబర్ 10(తెలుగు గళం)

అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని జఫర్‌గఢ్ మండల బీజేపీ తరఫున డిమాండ్ చేస్తున్నామని జఫర్‌గఢ్ మండల 'మన్ కీ బాత్' కన్వీనర్ ఎడెల్లి కార్తీక్ అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అర్హులకు న్యాయం చేయాలని కోరినందుకు బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయడం సరైన చర్య కాదని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎడెల్లి కార్తీక్ కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ వేంసూరు మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక"



సత్తుపల్లి/వేంసూరు, నవంబర్ 10 (తెలుగుగళం) న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య వేంసూరు మండల శాఖ 13వ మహాసభలు శుక్రవారం నిర్వహించగా, నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సూర్యం, పర్యవేక్షకులుగా పారుపల్లి నాగేశ్వరరావు, నిర్మలకుమారి, ఉమామహేశ్వరరెడ్డి, వి.వి. రామారావు వ్యవహరించారు.

నూతన మండల శాఖ అధ్యక్షుడిగా గుత్తా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బొరోజు ఈశ్వరాచారి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, సత్యవతి, కోశాధికారిగా ఎస్.డి. యాకూబ్ అలీ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా దీన్ దయాల్, రాఘవులు, భాస్కరరావు, రామశేషు, కిషోరి, సత్యవాణి, లెక్కల పరిశీలకుడిగా సీహెచ్. రాధాకృష్ణ, వీఓటీటీ పత్రిక సమన్వయకర్తగా ఎన్. మారేశ్వరరావు ఎన్నికయ్యారు.

జిల్లా మహాసభల ప్రతినిధులుగా రమేష్, హసీనాబేగం, వీరాంజనేయ, ప్రసన్నకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా గడ్డం మహేందర్

నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్



హనుమకొండ (తెలుగు గళం), నవంబర్ 10:

బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన గడ్డం మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గడ్డం మహేందర్ మాట్లాడుతూ తనకు రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.బీజేపీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని, ముఖ్యంగా దళిత సామాజిక వర్గాల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానన్నారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని గడ్డం మహేందర్ స్పష్టం చేశారు.

జనగామను కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలి

జిల్లా కలెక్టర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు: సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



జనగామ, నవంబర్ 10 (తెలుగుగళం)

ఎలినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, జనగామ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంట నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన జిల్లా యంత్రాంగం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, జిల్లా కలెక్టర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.మంగళవారం జనగామలోని సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో కనకారెడ్డి మాట్లాడుతూ..వర్షాభావ పరిస్థితులతో రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటలకు సరైన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి 200 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు.రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు పాత వ్యవసాయ రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.గత జూలై నుంచే దేవాదుల ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలను నింపి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు.జిల్లాలో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నవంబర్ 15 తర్వాత జిల్లావ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలు చేపట్టి జనగామను కరువు ప్రాంతంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేసిన కనకారెడ్డి.. ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం, అధికారాన్ని అడ్డుపెట్టుకొని అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. జనగామ పట్టణంలో గతంలో ఇళ్ల స్థలాలు పొంది సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.గతంలో డ్రా ద్వారా ఎంపికైన 72 మంది లబ్ధిదారులను పక్కనపెట్టి కొత్తవారికి ఇళ్లు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై సీపీఎం నిర్వహించిన సర్వే నివేదికను జిల్లా కలెక్టర్ స్వీకరించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు అందించే వినతులను గౌరవంగా స్వీకరించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తన వ్యవహారశైలిని మార్చుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు.సీపీఎం ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని, రైతులు, కార్మికులు, పేదల హక్కుల సాధన కోసం ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బోడ నరేందర్, పోత్కనూరి ఉపేందర్, బి. గణేష్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, కచ్చగళ్ల వెంకటేష్, బాధితులు శోభ, బూడిది అంజమ్మ, బూడిది రాజమణి, కవిత, పాలమాకుల మంజుల, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి: జాజిరి శ్రీనివాస్



సత్తుపల్లి,ఆర్ సి,నవంబర్10 (తెలుగుగళం న్యూస్: సత్తుపల్లి మండలంలో మురసు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో చేతికొచ్చిన పంటను తుఫాన్ వరదలు తీవ్రంగా దెబ్బతీశాయని, పలు గ్రామాల్లో పంటలు నీటమునిగి మొలకలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాకర్లపల్లి గ్రామంలోని బేతుపల్లి పెద్ద చెరువు వరద ఉద్ధృతికి శివారు పొలాలు మునిగిపోయాయని, కాలువ కట్ట వద్ద గండి పడటంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ముఖ్యంగా దళిత రైతుల పొలాలు సైతం ముంపునకు గురయ్యాయని, ఇప్పటివరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవని విమర్శించారు.అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం మండలంలో 496 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు సమాచారం ఉందని, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు మరోసారి సమగ్రంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలని కోరారు. చివరి బాధిత రైతుకు కూడా నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కాకర్లపల్లికి చెందిన దళిత మహిళా రైతు హెచ్చు బాయమ్మ మాట్లాడుతూ తమ ఎకరా పొలంలో పంట కోతకు ముందే మొలకలు వచ్చాయని, వరద నీటితో పాటు కొట్టుకొచ్చిన చెత్తాచెదారంతో పొలం నిండిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. సాగు కోసం రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని, తమ కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారమని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

ఈ పరిశీలనలో సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు వేపులపాటి కుమారస్వామి, మండల కమిటీ సభ్యులు దాట్ల రాంబాబు, బండి వేలాద్రి, బాధిత దళిత మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి"





సత్తుపల్లి, ఆర్ సి,నవంబర్10(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి మండల ఐద్వా ఆధ్వర్యంలో ప్రచారం ఈనెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏ ఐ కె ఎస్) మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సిద్ధారం గ్రామంలో జనరల్ బాడీ సమావేశం తోటకూర నారాయణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం కరుణ మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు పోరాటాలకు కార్యచరణ రూపొందిస్తారని తెలిపారు. నవంబర్ 15 నల్లగొండలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఐద్వా సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి మాట్లాడుతూ రైతాంగ హక్కుల సాధన, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా సమస్యల ఉద్యమాలు నిర్వహిస్తూ సాగుదారులకు అఖిల భారత కిసాన్ సభ రక్షణ కవచంగా నిలుస్తుంది అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 13 నెలల పాటు కొనసాగిన రైతు ఉద్యమంలో అఖిలభాత కిసాన్ సభ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. 36వ జాతీయ మహాసభలకు ప్రతి గ్రామానికి ఇంటికి ఒకరు చొప్పున రైతులు , వ్యవసాయ కార్మికులు , మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, ఎలగం రాములు, రేసు లక్ష్మి, రేగుల మంగమ్మ, వాసం సీతారామమ్మ, బొడ్డుసరసమ్మ, రాయిని తిరుపతమ్మ, కిరణ్మయి, పున్నమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి నుండి అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు

కరపత్రాలు విడుదల చేసిన డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ
ఒక ఫోన్ కాల్ తో అన్నవరం, పంచారామాల బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం



సత్తుపల్లి,ఆర్ సి,నవంబర్10(తెలుగు గళం) న్యూస్:

కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం సత్తుపల్లి డిపో నుండి అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో ఏర్పాటు చేసిన స్పెషల్ బస్సులకు సంబంధించి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి డిపో నుండి ఈనెల 15, 22, 29 తేదీలు మరియు డిసెంబర్ 6 తేదీలలో పంచారామాలకు, అన్నవరం కు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు బస్సులు బయలుదేరుతాయి అని అన్నారు. పంచారామాలకు పెద్దలకు చార్జీ 1480 రూపాయలు పిల్లలకు చార్జీ 780 రూపాయలు గా నిర్ణయించినట్లు ఆయన వివరించారు. అన్నవరం కు చార్జి పెద్దలకు 610 పిల్లలకు 350 రూపాయల గా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం పంచారామాలకు 95820 సర్వీస్ నెంబర్ తో మరియు అన్నవరంకు 98000 సర్వీస్ నెంబర్ తో ఆన్లైన్ సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 23వ తేదీ సోమవారం రాత్రి ప్రత్యేక డీలక్స్ బస్సు అన్నవరం, పంచారామాలకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9866619189,7032182456,9959225962,9959225990 సంప్రదించవచ్చును అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, స్టేషన్ మేనేజర్ జాలాది.ఆనందం, TI 3 జాకబ్, మస్తాన్ బి, హుస్సేన్ , శివకోటి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 100 సీట్లు వస్తాయన్న మహేష్ గౌడ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: నగేష్ ముదిరాజ్

సీఎం మెప్పు కోసమే మహేష్ గౌడ్ భజన..
కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో విఫలం



హైదరాబాద్ నవంబర్ 10 (తెలుగు గళం)

రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం. నగేష్ ముదిరాజ్ తప్పుబట్టారు.మంగళవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ పదవి కోల్పోయే పరిస్థితి ఉందని, మరోసారి ఆ పదవిని దక్కించుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పు పొందే ప్రయత్నంలో భాగంగానే ఆయన భజన చేస్తున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా పొందలేని పరిస్థితిలో బహిరంగ సభల్లో ముఖ్యమంత్రిని ఆకాశానికి ఎత్తడమే మహేష్ గౌడ్ పనిగా మారిందని ఆరోపించారు.తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయి తిరిగి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని నగేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.గడ్డాలు పెంచుకున్న వారంతా రేవంత్ రెడ్డిలు కాదంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ..గడ్డం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్‌గా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మరి రేవంత్ రెడ్డి ఎవరిని చూసి గడ్డం పెంచుకున్నారని ప్రశ్నించారు. గడ్డాలు, ఫామ్‌హౌస్‌ల పేరుతో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా రెండోసారి అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన సమాధానం చెబుతారని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చి కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని నగేష్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు.

డబ్బుల గొడవలో కత్తిపోట్లు

– పామిడిలో నిందితుడి అరెస్ట్, 10 ఏళ్ల జైలు శిక్ష తప్పదని సీఐ హెచ్చరిక



తెలుగుగళం న్యూస్,పామిడి.

డబ్బుల వ్యవహారంలో తలెత్తిన వివాదం కత్తిపోట్లకు దారితీసిన ఘటనలో నిందితుడిని పామిడి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 8వ తేదీ రాత్రి పామిడి పట్టణంలోని మెయిన్ బజార్‌లో డబ్బుల విషయంలో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ గొడవలో జిట్టా మంగల ఎరిస్వామి అనే వ్యక్తి కోపంతో ఊగిపోతూ మురళీధర్ గుప్తా అనే వ్యక్తిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు.కత్తిపోట్లకు గురైన మురళీధర్ గుప్తా తీవ్రంగా గాయపడ్డారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పామిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం నిందితుడు ఎరిస్వామిని అదుపులోకి తీసుకుని స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు.న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించడంతో అతడిని జైలుకు తరలించారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించం --- సీఐ

ఈ సందర్భంగా పామిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి ప్రాణాంతక దాడులకు పాల్పడే నిందితులకు చట్టప్రకారం 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

డాక్టర్ విధుల్లో ఉన్నారా..?

- లేక విధులకే దూరమా..?
- కల్లూరు పశువైద్య శాఖలో అంతులేని నిర్లక్ష్య ఆరోపణలు!
- ఆసుపత్రిలో వైద్యు అధికారిని కరువు.. రైతులకు సమాధానాలు మాత్రం ఘాటు!
- ప్రశ్నిస్తే బాధ్యతాయుత సమాధానం లేదు.. పైగా నిర్లక్ష్యపు ధోరణి!
- మూగజీవాల ప్రాణాలతో చెలగాటమా..? ఉన్నతాధికారుల పర్యవేక్షణ గాలికొదిలేశారా..?



సత్తుపల్లి/కల్లూరు, నవంబర్ 10 (తెలుగు గళం) న్యూస్: మూగజీవాలకు వైద్యం అందించాల్సిన పశు వైద్యశాఖలోనే విధుల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు అండగా నిలవాల్సిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా? లేవా? అన్న అనుమానాలు కల్లూరు మండలంలో వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రికి వెళ్తే వైద్య అధికారిని కనిపించరనే ఆరోపణలు.. అత్యవసర సమయంలో వైద్యం కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు.. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి.

కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ పశువైద్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ, కల్లూరు పట్టణ పశువైద్య కేంద్రం ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్న వైద్య అధికారిని పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విధుల సమయంలో వైద్య అధికారిని అందుబాటులో ఉండటం లేదని, పశువైద్య కేంద్రానికి వెళ్లిన రైతులకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆసుపత్రి ఎక్కడ..? డాక్టర్ ఎక్కడ..?

ప్రభుత్వం ప్రజల కోసం పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. వాటిలో వైద్యులు అందుబాటులో ఉండాల్సిన బాధ్యత లేదా? విధుల సమయంలో వైద్యాధికారి అందుబాటులో లేకపోతే రైతులు ఎవరిని ఆశ్రయించాలి? పశువులకు అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎవరు బాధ్యత వహించాలి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నిస్తే, రైతుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందిస్తున్నామని సమాధానం చెబుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆ సేవలు ఎప్పుడు, ఎక్కడ, ఎంతమందికి అందుతున్నాయో ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేరా..? ఇదేనా అధికారుల బాధ్యత..?

విధుల నిర్వహణపై వివరణ కోరిన పాత్రికేయుల పట్ల వైద్యాధికారి స్పందించిన తీరు కూడా విమర్శలకు తావిస్తోంది. 'వార్తలు రాసుకోండి.. ఎవరికైనా చెప్పుకోండి.. మీరేం రాసుకుంటారో రాసుకోండి' అంటూ అసహనంగా స్పందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదా? విధులపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూగజీవాల ప్రాణాలు చవకైపోయాయా..?

పశువులే జీవనాధారంగా బతుకుతున్న చిన్న, సన్నకారు రైతులకు పశువైద్య సేవలు అత్యంత కీలకం. పశువు అనారోగ్యానికి గురైతే రైతు కుటుంబం ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోతే రైతుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ వైద్య సేవలు అందక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తే ఆ ఖర్చు ఎవరు భరించాలి? మూగజీవాలు తమ బాధను చెప్పుకోలేవు కాబట్టి వాటి సమస్యలను అధికారులు కూడా పట్టించుకోరా? అన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది.

గత విమర్శలకూ స్పందన లేదా..? మార్పు ఎప్పుడు..?

గతంలోనూ వైద్యాధికారిణి పనితీరుపై విమర్శలు వ్యక్తమైనప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకే అధికారికి రెండు కేంద్రాల బాధ్యతలు ఉన్న నేపథ్యంలో రెండు చోట్లా వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా? విధుల సమయాలను ఎలా నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమైంది..?

మండల స్థాయిలో పశువైద్య సేవల నిర్వహణపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైద్యాధికారిని హాజరు రికార్డులు, ఆసుపత్రి పని వేళలు, క్షేత్రస్థాయిలో అందించిన వైద్య సేవలు, రైతుల ఫిర్యాదులపై ఇప్పటివరకు ఎలాంటి పరిశీలన జరిగింది? అన్నది వెల్లడించాల్సిన అవసరం ఉంది. కాగితాలపై విధులు నిర్వహించినట్లు చూపిస్తే సరిపోతుందా? క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందుతున్నాయా లేదా అన్నది చూడాల్సిన బాధ్యత అధికారులకు లేదా?

జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలి!

చెన్నూరు, కల్లూరు పశువైద్య కేంద్రాల్లో వైద్యాధికారిని విధుల నిర్వహణపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హాజరు వివరాలు, వైద్య సేవల రికార్డులు, రైతుల ఫిర్యాదులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు తప్పని తేలితే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే ఇలాంటి ఆరోపణలు వినిపిస్తుంటే ఇక సామాన్య రైతు ఎవరిని ఆశ్రయించాలి? మూగజీవాల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనంగా ఉంటే ప్రజల అనుమానాలకు తెరపడేదెలా?

ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్లు తెరిచి క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తారా..? లేక రైతుల ఆవేదనను గాలికి వదిలేస్తారా..? వేచి చూడాలి!

గోమాత రక్షణకై పోరాటం చేస్తాం

స్టేషన్ ఘనపూర్ తెలుగు గళం ప్రతినిధి నవంబర్ 10



భాగ్యనగర్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయవాది నలగామ శ్రీనివాస్ ఎల్ఎల్ బి ను కలిసి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న గోహత్యలపై సంబంధిత అధికారులకు పలుమార్లు సమర్పించిన వినతిపత్రాలు, వాటికి సంబంధించిన రిసీవ్డ్ కాపులను అందజేయడం జరిగింది.గోహత్యలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించకపోవడం, అధికారుల నిర్లక్ష్యంపై మా ఆవేదనను వివరించడం జరిగింది. ఈ అంశాన్ని న్యాయపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత పత్రాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ఈ సందర్భంగా న్యాయవాది నలగామ శ్రీనివాస్ చట్టపరమైన మార్గంలో ముందుకు సాగి, గోమాతకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.మా పోరాటం వ్యక్తులపై కాదు గోహత్యలకు వ్యతిరేకంగా, చట్టాన్ని అమలు చేయాలనే న్యాయబద్ధమైన పోరాటం.వినతిపత్రాలతో మొదలైన మా ప్రయాణం న్యాయపోరాటం వరకు చేరుకుంది. అధికారుల నిర్లక్ష్యానికి చట్టమే సమాధానం చెప్పాలి. గోమాత రక్షణ కోసం మా గొంతు ఆగదు మా అడుగు వెనక్కి పడదు అని గోరక్ష కార్యకర్త పసునూరి సందీప్ కుమార్ అన్నారు.గోహత్యలకు అడ్డుకట్ట వేయాలి.

హైదరాబాద్‌లో ఐదు ఫెర్టిలిటీ కేంద్రాలకు మహిళా కమిషన్ నోటీసులు



హైదరాబాద్ నవంబర్ 10(తెలుగు గళం)

మహిళల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అండాల సేకరణ జరుగుతోందన్న ఆరోపణలపై తెలంగాణ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. హైదరాబాద్‌లోని ఐదు ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టింది.ఇందిరా ఐవీఎఫ్, నర్మదా ఫెర్టిలిటీ సెంటర్, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్, సద్గురు ఏఆర్టీ సెంటర్, పద్మజ ఫెర్టిలిటీ సెంటర్ల ప్రతినిధులు సోమవారం బుద్ధభవన్‌లోని మహిళా కమిషన్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద సమక్షంలో జరిగిన విచారణలో అండాల దాతల నుంచి రాతపూర్వక అనుమతి తీసుకున్నారా? వైద్యపరమైన భద్రతా ప్రమాణాలు పాటించారా? అండాల సేకరణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను అమలు చేస్తున్నారా? అనే అంశాలపై వివరణ కోరినట్లు సమాచారం.ముఖ్యంగా అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ చట్టం--2021 నిబంధనల ఉల్లంఘన జరిగిందా? మహిళల ఆరోగ్యం, గౌరవం, పునరుత్పత్తి హక్కులకు భంగం కలిగిందా? అనే అంశాలపై కమిషన్ ఆధారాలను పరిశీలించనుంది.సంబంధిత కేంద్రాలు లిఖితపూర్వక వివరణతో పాటు అవసరమైన వైద్య రికార్డులను సమర్పించాల్సి ఉంది.విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.మహిళల ఆరోగ్యం, హక్కుల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మహిళా కమిషన్ స్పష్టం చేసింది. అయితే, ఈ వ్యవహారంలో ఆరోపణలు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. ఏ కేంద్రంపైనా నేరం నిర్ధారణ కాలేదు.

దోపిడీ, పీడనలేని సమసమాజ స్థాపన కోసం పోరాడాలి

: సిపిఐ ఎమ్ ఎల్ మాస్ లైన్





సత్తుపల్లి,ఆర్ సి,నవంబర్10(తెలుగు గళం) న్యూస్:

ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూకలకుంట రవి,

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఏ. వెంకన్న పిలుపు నిచ్చారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వర్ధంతి సభల్లో భాగంగా సిపిఐ ఎమ్ ఎల్ మాస్ లైన్ సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నీలం రామచంద్రయ్య భవనం లో డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్ అధ్యక్షత న నిర్వహించిన సభ లో హాజరైన ప్రజలు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా

మాట్లాడుతూ, దేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ, పాలకవర్గాల విధానాల వల్ల పేద ప్రజలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారని విమర్శించారు. ఈ పరిస్థితుల నుంచి ప్రజలు బయటపడాలంటే, ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములై వ్యవస్థలో మార్పు కోసం కృషి చేయాలని అయన అన్నారు .దేశంలోని సహజ వనరులను, ఖనిజాలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు , బొగ్గు గనులు, పోస్టల్,రైల్వే,రోడ్లు, ప్రాజెక్టు,విమానయానం, భూములు, పెట్రోలు బావులు, అడవులు బడా కంపెనీలకు స్వదేశీ, విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టబెడుతూ ప్రజా సంపదను దోపిడీ చేస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగు లకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేశాడని, కాంగ్రెస్ అవినీతి పుట్టని విమర్శిస్తూ, మోడీ ప్రభుత్వంలో అవినీతి తిమింగ లాలు పెరిగిపోయినారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు 420 వాగ్దానాలు చేసి మూడు సంవత్సరాలు అవుతున్న ప్రజలకు న్యాయం చేయలేదని కాలయాపన చేస్తున్నాడని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ వాళ్లకు ఉపాధి పథకం గా మారిందని, కాంగ్రెస్ కండువాళ్ళు కప్పుకున్న వారికే ఇందిరమ్మ ఇల్లులు ఇస్తాననడం శో చ నీ యమని అన్నారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపడం దారుణమన్నారు.విమర్శించారు. సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా వేలాదిమంది అమరవీరులు చేసిన ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ, వారి కర్తవ్యాల కోసం పాటుపడాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంట శ్రీను, మండల నాయకులు సున్నం కృష్ణ, దుంప రాఘవులు, కుంట కృష్ణ, నేకొండ అలివేలు, వెంకటనరసమ్మ, నారాయణ, విశ్వనాధం, రాములమ్మ,జలాల్ బి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టియస్ యూటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

స్టేషన్ ఘనపూర్, తెలుగు గళం ప్రతినిధి, నవంబర్ 10





స్టేషన్ ఘనపూర్ మండల టియస్ యూటిఎఫ్ నూతన కమిటీని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన మండల మహాసభలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్, జిల్లా కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా కోరుకొప్పుల రాజు (యూపియస్ తానేదార్ పల్లి), ఉపాధ్యక్షులుగా ఏ. రేణుకాదేవి (పియస్ ఇప్పగూడెం),యండి సలావుద్దీన్ (తాటికొండ ఉన్నత పాఠశాల),ప్రధాన కార్యదర్శిగా ముడిదె రాము (పియస్ అక్కపల్లిగూడెం),కోశాధికారిగా యం. పూర్ణచందర్ (పియస్ విశ్వనాధపురం), కార్యదర్శులుగా యండి ఖాదర్ పాషా,ఆర్. రేణుకాదేవి, జి. ఫకీర్ దాస్, రజియా, బి. శ్రీకాంత్, ఆర్ వి శరత్ బాబ్,ఆడిటర్ గా లక్ పతి,ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ గా టి. కిరణ్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ధన్యవాదములు తెలిపారు.

జఫర్గడ్‌లో స్వేరోస్ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ



జఫర్గడ్, నవంబర్ 10 (తెలుగు గళం)

ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న స్వేరోస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం జఫర్గడ్ కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.స్వేరోస్ ఆత్మీయ సమ్మేళనం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కో-కన్వీనర్ వంగాల కుమార్, జఫర్గడ్ మండల కన్వీనర్, తిడుగు గ్రామ ఉపసర్పంచ్ కలకోటి మనోహర్, కో-కన్వీనర్ ఇల్లందుల రాజు చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జనగామ జిల్లా అధ్యక్షుడు మాదాపూర్ విజయ్ కుమార్ స్వేరో, స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల సందీప్, స్వేరోస్ సీనియర్ నాయకుడు కృష్ణ, జఫర్గడ్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.